క్లుప్తంగా

సబ్ జైళ్ల తనిఖీ


తాడిపత్రి సబ్ జైలు ఆవరణలో ఖైదీలతో మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా సెక్రటరీ శివప్రసాద్‌యాదవ్

గుత్తి/తాడిపత్రి అర్బన్:: గుత్తి పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును మంగళవారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని సెల్స్ పరిశీలించారు. ఖైదీల సదుపాయల ఆరా తీశారు. అనంతరం అమ్మకు వందనం కింద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి జైలు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి, జైలు అధికారి మహేశ్వరుడు, న్యాయవాదులు గంగాధర్ కుమార్, సూరి తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి సబ్‌జైలను జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రెటరీ డి.శివప్రసాద్ యాదవ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో సమావేశమై సౌకర్యాలపై ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు న్యాయ సలహాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

గుంతకల్లు: విద్యార్థులు ర్యాగింగ్ భూతంలో బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీశంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎస్ఐ పద్మావతి, సీడబ్ల్యూసీ వెంకటేశ్వరమ్మ తదితరులు హాజరై మాట్లాడారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, మహిళ పోలీస్ మీనా తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం


మాట్లాడుతున్న బొంబాయి రమేష్ నాయుడు

యాడికి: పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యాడికి ఈఓ ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పొదుపు సంఘాల మహిళలు, స్థానికులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా కేసీ హరి


హరిని సత్కారిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంతకల్లు: పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కేసీ హరి మార్క్‌ఫెడ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులయ్యారు. టీడీపీ అధిష్టానం మంగళవారం నామినెటెడ్ పదవుల జాబితా విడుదల చేసింది. జెడ్పీ మాజీ చైర్మన్ కేసీ నారాయణ కుమారుడు హరి పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. కాగా శ్రీశంకరనంద గిరి స్వామి జూనియర్, డిగ్రీ కళాశాలకు కరస్పాండెంట్ ఉంటున్న హరిని అధ్యాపకులు, సిబ్బంది పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గుత్తిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, సీనియర్ నాయకుడు నారాయణ, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు చౌదరి, బర్దివలి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాసగిరి మణికంఠ, పట్టణ, మండల అధ్యక్షులు పాటిల్ సురేష్, చిన్న వెంకటేష్, బీజేపీ అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కర్ణాటక కిక్కు



గ్రామాల్లో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా మద్యం రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పేదలు కూలి మొత్తం మద్యానికే తగలేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

- ఏరులైపారుతున్న కర్ణాటక మద్యం
- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం షాపులు
- చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం


పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం (ఫైల్)

యల్లనూరు: గత ప్రభుత్వ హయాంలో కనుమరుగైన బెల్ట్‌షాపులు ఇప్పుడు ఊరూరా వెలిశాయి. చికెన్ దుకాణాలు, చిల్లర దుకాణాలు, టీ స్టాళ్లు, జనరల్ స్టోర్లు, వాటర్ ప్లాంట్లలోనూ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. యల్లనూరు మండల కేంద్రంలో మాత్రమే ఒక ప్రభుత్వ బెల్ట్‌షాపు ఉంది. మరెక్కడా లేదు. మద్యం కావాలంటే అటు యల్లనూరుకు లేకుంటే ఇటు పులివెందుల ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ దుకాణాల్లో తెచ్చుకోవాల్సిందే. దీంతో ఊరూరా బెల్ట్ షాపులు వెలిశాయి. మద్యం షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీంతో మద్యం విక్రేతలు ఇష్టారంగా వ్యవహరిస్తున్నారు. కర్ణాటక మద్యాన్ని రాష్ట్రాలను దాటించి తాడిపత్రికి తెస్తున్నారు. అక్కడ నుంచి యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో స్టాక్ పాయింట్ పెట్టి.. అక్కడ నుంచి పల్లెలకు సరఫరా చేస్తున్నారు. గరుగుచింతలపల్లికి చెందిన ఓ వ్యక్తి, ధర్మవరానికి చెందిన ఓ వ్యక్తి పెద్దత్తున కర్ణాటక, గోవా మద్యం స్టాకును కార్లల్లో తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. చాలా పకడ్బందీగా విక్రయాలు చేసుకుంటున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నారు. యల్లనూరు మండలంలో కిరాణా షాపులు, చికెన్ దుకాణాలు, వాటర్ ప్లాంట్లలో సైతం మద్యం విక్రయిస్తున్నా పోలీసులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ప్రశ్నిస్తే తూతూమంత్రంగా దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఒక్క తిమ్మంపల్లిలోనే ఆరుగురు వ్యక్తులు మద్యం విక్రయిస్తున్నారని తెలుస్తోంది.

గాడితప్పిన శాంతిభద్రతలు

మండలంలో శాంతిభద్రతలు గాడితప్పాయి. పోలీసులే అన్ని పనులూ చేయిన్నారని ఆరోపణలు లేకపోలేదు. కొందరు పోలీసు సిబ్బంది అవినీతి అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. వారిపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. 15 రోజుల కిందట చిలమకూరు, తిరుమలాపురం, యల్లనూరు చిత్రావతి నదిలో రాత్రికి రాత్రే ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించినా పోలీసులు చేసిందేమి లేదు. కేసు కట్టిన దాఖలాలు లేవు. యజమానులతో పోలీసులు మామూళ్లు వసూలు చేసి ట్రాక్టర్లను వదిలేశారు. కాగా ఎన్నికల అనంతరం ఎస్ఐ గిరిబాబు సిక్ లీవ్‌లో వెళ్లడంతో మట్కా, పేకాట, మద్యం, అక్రమ ఇసుక రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలు భారీగా పెరిగాయి. ఇటీవలే ఎస్ఐ రాంప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతత పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

చర్యలు తీసుకుంటాం



మట్కా, పేకాట, మద్యం, ఇసుక అక్రమ రవాణాపై విచారిస్తున్నాం. అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే ఎంతటివారినైనా వదలేసే ప్రసక్తి లేదు. జిల్లా ఎస్పీ జగదీష్ , అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కూడా సీరియస్‌గా ఉన్నారు. బృందాలు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

– ఎస్ఐ రాంప్రసాద్ , యల్లనూరు

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: అక్రమంగా మద్యం బాటిళ్ల విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఓగేటి శ్రీరంగ కొంత కాలంగా మండల కేంద్రంలోని కుంటలో ఉన్న బాత్ రూముల వద్ద మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం రావడంతో మంగళవారం దాడి చేశామన్నారు. శ్రీరంగను అరెస్టు చేసి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

నల్ల బెల్లం రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

నాటుసారా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని మండల కేంద్రంలోని కోన రోడ్డు క్రాస్ వద్ద అరెస్టు చేసి, అతడి నుంచి 25 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. నిందితుడు నంద్యాల జిల్లా అవుకు మండలం కొండమ నాయుని పల్లికి చెందిన నేనవత్ శ్రీరామ్‌నాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

జాబ్ స్కిల్స్‌పై వర్క్‌షాప్


విద్యార్థులతో కంపెనీ డైరెక్టర్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాబ్ స్కిల్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన స్మాక్ కంపెనీ అకడమిక్ డైరెక్టర్ నిఖిల్ ఉద్యోగాలకు కావలసిన మెలకువలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా గుణశ్యామ్



గుంతకల్లు రూరల్: మండలం వెలుగు ఏపీఎంగా గుణశ్యామ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న వీరస్వామి తాడిపత్రికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో విడపనకల్లు మండలం నుంచి గుణశ్యామ్ గుంతకల్లు మండలానికి బదిలీ అయ్యారు.

హౌసింగ్ ఏఈగా సంధ్య



పుట్లూరు: మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం ఏఈ సంధ్య బాధ్యతలు స్వీకరించారు. తాడిపత్రి హౌసింగ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఈమె బదిలీపై పుట్లూరు ఏఈగా నియామకమయ్యారు. పుట్లూరు హౌసింగ్ ఏఈగా ఉన్న లోకేష్ యాడికి మండలానికి బదిలీ అయ్యారు.

పామిడి ఏఈగా మారుతి

పామిడి: మండల హౌసింగ్ ఏఈగా మారుతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఈగా పని చేస్తున్న సంపత్ నార్పలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంతకల్లు నుంచి మారుతి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఆటో, ద్విచక్ర వాహనాలను అందజేస్తున్న రీజనల్ మేనేజర్ శ్రీదేవి

యాడికి: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీదేవి సూచించారు. మంగళ వారం మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రుణ వితరణ కార్యక్రమంలో రుణదాతలకు 7 ట్రాక్టర్లు, ఆటో, 3 ద్విచక్ర వాహనాలు, ముద్ర రుణాలు, వ్యవసాయ రుణాలు, డ్వాక్రా రుణాలు, ఎడ్యుకేషనల్ రుణాలు పంపిణీ చేశారు. దాదాపు రూ.8.14కోట్ల రుణాలను రీజనల్ మేనేజర్ లబ్ధిదారులకు అందజేయటమే కాకుండా వాహనాల తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్లు జయశంకర్, శ్రీధర్, సిబ్బంది వెంకటేశ్వరి, వినోకుమార్, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు పాలొన్నారు.

'పొలం పిలుస్తోంది' సద్వినియోగం చేసుకోండి


పెద్దవడుగూరు మండలంలో పత్తి పంటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/యల్లనూరు/యాడికి/గార్లదిన్నె/పెద్దవడుగూరు/పామిడి/బుక్కరాయసముద్రం: 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. మంగళవారం గుంతకల్లు మండలంలోని దంచర్ల, యల్లనూరు మండలంలోని నిట్టూరు, యాడికి మండలంలోని గుడిపాడు, కుందనకోట, గార్లదిన్నె మండల పరిధిలోని మర్తాడు, కోటంక, పెద్దవడుగురు మండలంలోని పెద్దవడుగూరు, లక్ష్మంపల్లి, పామిడి మండలంలోని కండ్లపల్లి, సొరకాయలపేట, బుక్కరాయసముద్రం మండంలోని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు చీనీ, పత్తి, పొగాకు, కొర్ర, వేరుశెనగ, వరి, కంది, దానిమ్మ పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. డ్రిప్ , స్ప్రింక్లర్ల వాడకంపై అవగాహన కల్పించారు.అనంతరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో గుంతకల్లు, యల్లనూరు, యాడికి, గార్లదిన్నె, పెద్దవడుగూరు, పామిడి, బుక్కరాయసముద్రం ఏఓలు స్వాతి, రామకృష్ణ, మహబూబ్‌బాషా, సోమశేఖర్, మల్లీశ్వరి, లీనా వసుంధర, శ్యాంసుందర్‌రెడ్డి, బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, ఏఈఓలు, హెచ్‌ఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయాల తనిఖీ


నార్పలలో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

శింగనమల/గార్లదిన్నె: నార్పలలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్‌డీ శైలజారాణితో మాట్లాడారు. ఉపాధి ఏపీఓ ఎర్రమ్మ, సిబ్బందితో మండలంలోని కూలీల వివరాలు, పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. పరిపాలన పరమైన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్ణయ్య, ఏఓ ఏమాదేవి, డిప్యూటి తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గార్లదిన్నె మండలం ఎగువపల్లికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ భర్త వెంకటేషులు రెండో పెళ్లి చేసుకున్నారని, న్యాయం చేయాలని అర్జీ ఇవ్వడంతో విచారణ నిమిత్తం గార్లదిన్నెకు వచ్చి ఆదిలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నామన్నారు.

విద్యార్థుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం


ఆర్డీఓతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లు: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూటమి ప్రభుత్వ ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్ ఆరోపించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో టీచర్ల కొరత వేధిస్తోందన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడిందన్నారు. అనంతరం ఆర్‌డీఓ శ్రీనివాసులురెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిల్, రోహిత్, మధు, హేమంత్, షేక్షావలి, రాజేష్, సుమీర్, ఖలీల్, హరి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లతో ఇసుక తోలుకుంటే కేసులా?


డీఎస్పీతో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో ఇసుకు తోలుతుంటే పోలీసులు కేసులు పెట్టుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ట్రాక్టర్ డ్రైవర్లతో కలిసి ఆయన డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిశారు. జగదీష్ మాట్లాడుతూ ట్రాక్టర్లు, ఎద్దులబండ్ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. అయితే పోలీసులు ఇసుక ట్రాక్టరు కనిపిస్తే.. స్టేషన్‌కు తరలించి కేసులు పెడుతున్నారన్నారు. వారి జీవనాన్ని దృష్టిలో ఉంచుకుని, కేసులు పెట్టుకుండా ఇసుకను తరలించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, గౌస్, ఈశ్వర్యయ్య, చెరువునాగన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి ఉరుసు

పామిడి: పట్టణంలోని దర్గాలో సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదని ఉరుసు బుధ, గురు, శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 25న రాత్రి 9 గంటలకు గంధం ఊరేగింపు ఉంటుందన్నారు. 26న రాత్రి ఉరుసు, 27న రాత్రి జియారత్‌తో ఉరుసు ముగుస్తుందన్నారు.

బధిర విద్యార్థుల ప్రతిభ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సిద్ధరాంపురం రోడ్డు సమీపాన ఉన్న బధిరుల పాఠశాలలోని విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయుడు ఎర్రిస్వామి తెలిపారు. అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం సందర్భంగా ఆర్డీటీ క్రీడా ట్రెడిక్షన్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో బీకేఎస్‌లోని బధిరుల పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. క్రిష్ణ, సత్య నారాయణరెడ్డి, బధిరుల విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల సమావేశం

పామిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్ శ్రీధర్‌మూర్తి మాట్లాడారు. ఓటరు జాబితా నుంచి తొలగింపు, సవరణను సక్రమంగా చేపట్టాలని సూచించారు. బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం

గుంతకల్లు: పట్టణంలోని కేసీ నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం రూ.2.22 లక్షలు సేకరించి సీఎం సహాయ నిధికి పంపినట్లు కరస్పాండెంట్ కేసీ హరికుమార్ తెలిపారు. హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాల విరాళాల సేకరణలో పాల్గొన్నాయన్నారు.

ఘనంగా హిందీ బాషా దినోత్సవం

పెద్దవడుగూరు: విద్యార్థులు హిందీ భాషపై మక్కువ పెంచుకోవాలని ఎంఈఓ రాముడు, హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చిత్రచేడు జెడ్పీ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు విజయమేరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి రూరల్: స్థానిక కౌన్సిల్ హాలులో బుధవారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు మంగళవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్‌మెంబర్లు, అధికారులు హాజరు కావాలన్నారు.

'మన ఇల్లు – మన గౌరవం'పై అవగాహన

యల్లనూరు/పామిడి: యల్లనూరు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల ప్రత్యేకాధికారి రఘునాథ్ ఆధ్వర్యంలో 'మన ఇల్లు- మన గౌరవం' అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ మార్చి నెలాఖరులోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ నెల 28న నిర్వహించే అవగాహన సదస్సుల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ వీరరాజు, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, పీఆర్ జేఈ నరేంద్ర, హౌసింగ్ ఏఈ సుప్రజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే పామిడి ఎంపీడీఓ కార్యాలయలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఏఈ సంపత్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

28న 'సహకార' మహాసభ

గార్లదిన్నె: మండల కేంద్రంలో స్థానిక జంబులదిన్నె వ్యవసాయ సహకార సంఘం మహాసభ ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ ఇస్మాయిల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటీకరణ చేస్తున్నామని, సంఘం సభ్యులందరూ కేవైసీ చేయించుకోవాలన్నారు. మహాసభ సమావేశానికి సభ్యులందరూ తప్పక హాజరు కావాలన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

శింగనమల: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీఓ ఉమాశంకరమ్మ మాట్లాడుతూ రక్త హీనత, పిల్లల ఎదుగుదల , కాంప్లిమెంటరీ ఫీడింగ్ , ఆహారంలో వైవిధ్యతలపై వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు కౌసల్య, ధనలక్ష్మి, ఉమాదేవి, వాణిశ్రీ, హేమలత, అన్నపూర్ణమ్మ, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఓ 58 ఉపసంహరించుకోవాలి

శింగనమల/యల్లనూరు/గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులకు జీఓ 85 వల్ల తీవ్ర అన్యాయం జరుగుతున్నదని తరిమెల, బీకేఎస్ పీహెచ్‌సీ వైద్యులు శంకర్‌నాయక్, స్వాతిలక్ష్మి, గార్లదిన్నె, యర్రగుంట్ల వైద్యులు గౌతమి, దిలీప్‌కుమార్, యల్లనూరు వైద్యులు లోకేష్, శివ, కీర్తన అన్నారు. ఈ జీఓ వల్ల పీజీ సీట్లు కోల్పోతామన్నారు. ఈ జీఓ వల్ల భవిష్యత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పని చేసేందుకు ఎవరూ ముందుకు రారన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ జీఓను ఉప సంహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం జీఓ 85కు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో మంగళవారం పీహెచ్‌సీ వైద్యులు ఉద్యమించారు.

కార్మికుడికి గాయాలు

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేస్తుండగా సోమవారం రాత్రి బీహార్‌కు చెందినడమర్‌కుమార్ తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్రీడాకారిణులకు అభినందన


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పామిడి: పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడారు. విజయవాడలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించిన అండర్–19 బాలబాలికల ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ పోటీల్లో బాలికల జట్టు నాలుగో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. క్రీడాకారిణులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ నరేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

తాడిపత్రి రూరల్: మండలంలోని బ్రహ్మణపల్లి, బి.కొత్తూరు పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. జాతీయ అంధత్వ పథకం నివారణ కార్యక్రమంలో భాగంగా జీపీఎంఓ మధుసూదన్ రాజు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామరాజుపల్లిలో తహసీల్దార్ పర్యటన

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో మంగళవారం తహసీల్దార్ ఎన్. శ్రీధర్‌మూర్తి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన భూ సమస్యలపై సంబంధిత రైతులతో సమీక్షించారు. అలాగే గ్రామంలో బీసీ కులస్తులకు శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

రజకుడి ఇంటి ఎదుట దుస్తులకు నిప్పు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సుంకులమ్మపాలెంలోని చర్చి సమీపంలోని ఓ రజకుడికి చెందిన దుస్తులకు సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి సీఐ శివగంగాధర్ రెడ్డి వివరాల మేరకు.. ఉతికేందుకు పలు ఇళ్ల నుంచి తీసుకువచ్చిన దుస్తులను శ్రీనివాసులు తన ఇంటి ముందు ఉంచి నిద్రపోయాడు. సోమవారం రాత్రి 11.30కు గుర్తుతెలియని వ్యక్తులు దుస్తులకు నిప్పుపెట్టారు. చుట్టుపక్కల వారితో కలసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఘటనలో దుస్తులన్నీ కాలిపోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.